ట్యాబ్‌ల పంపిణీ


బాడంగి: కేజీబీవీలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న జెడ్పీటీసీ రామారావు

వంగర/బాడంగి/మెంటాడ: మండలాల్లోని పలు గ్రామాల్లో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను శుక్రవారం అందజేశారు. వంగర మండలంలోని కోనంగిపాడులో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ తాతబాబు, బాడంగిలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ రామారావు, వైస్ ఎంపీపీ రమేష్, మెంటాడ మండలంలోని గుర్లతమ్మిరాజుపేటలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, ఎంపీపీ దుర్గ, పార్టీ మండల అధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జగనే సీఎం కావాలి

వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం అన్నిచోట్ల చాలా చురుగ్గా జరుగుతోంది. జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో గ్రామాలు, పట్టణాలు, నగరాలు హోరెత్తుతున్నాయి. ప్రభుత్వం చేసిన మేలును వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో శుక్రవారం పార్టీ శ్రేణులంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లుగా జగనన్న సర్కారు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. సచివాలయాల వద్ద ప్రభుత్వ పథకాల డిస్‌ప్లే బోర్డులు, పార్టీ జెండాలు ఆవిష్కరించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి, రాష్ట్రంలోని ప్రజలకు మేలు అని, గతంలోని టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకున్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. మేలు జరిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటేసి, గెలిపించాలని కోరారు. జనమంతా జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిగా కావాలని ప్రజలు కోరుతుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపింది.

– సాక్షి నెట్‌వర్క్.


బాడంగి: ముగడలో ప్రభుత్వ పథకాల డిస్‌ప్లే బోర్డు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు


రేగిడి: వెంకంపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జగన్మోహనరావు తదితరులు

ఆదర్శప్రాయుడు రామానుజన్


రాజాం సిటీ: పొగిరి పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


రామభద్రపురం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో జాతీయ గణిత దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజున ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తుండడం విశేషం. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు తొలుత రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం గణితంలో ఆయన కనబరిచిన ప్రతిభాపాటవాలను కొనియాడారు. విద్యార్థులంతా ఆయనను ఆదర్శంగా తీసుకుని, గణిత మేధావులుగా వెలుగొందాలని ఆకాంక్షించారు. పలుచోట్ల గణిత పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్.

లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు

తెర్లాం: స్థానిక గ్రామసచివాలయం–2 వద్ద లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి చేతులమీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం ఇప్పుడు ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు అందించే వైద్యసేవల వ్యయ పరిమితిని రూ.10 లక్షల నుంచి 25 లక్షలకు పెంచిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ఎంతోమంది ప్రాణాలు కాపాడిందని, ఇటువంటి మహోన్నతమైన పథకం సేవలను ప్రభుత్వం విస్తృతం చేయడం చాలా గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, రమాదేవి అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేత

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు పురస్కరించుకుని, స్థానిక సన్‌రైజ్ ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తం దానం చేసిన పలువురికి వైఎస్సార్ సీపీ నేత తలే రాజేష్, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు చేతులమీదుగా శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ జగనన్నపై అభిమానంతో రక్తదానం చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలన్నారు. 42 యూనిట్ల రక్తం సేకరించడం జరిగిందని, ఈ రక్తాన్ని రెడ్‌క్రాస్‌కు అందించామని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాజాం ప్రతినిధులు కె.సాయిప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత రాజేష్, తదితరులు

లెస్సన్ ప్లాన్ తప్పనిసరి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా లెస్సన్ ప్లాన్ కలిగి ఉండాలని ఎంఈవో జె.త్రినాథరావు సూచించారు. మండలంలోని జన్నివలస ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రికార్డులతో పాటు ఉపాధ్యాయుల బోధనా తీరు, వారి లెస్సన్ ప్లాన్‌లను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

విగ్రహావిష్కరణ

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన శాసుబిల్లి గౌరునాయుడు, సత్తెమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు శాసుబిల్లి శ్రీరాములు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ కె.లక్ష్మి పాల్గొన్నారు.

యథావిధిగా అంగన్‌వాడీ కేంద్రాలు

సంతకవిటి: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ యథావిధిగా కొనసాగుతోంది. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్న కారణంగా లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించడంలో ఏమాత్రం జాప్యం లేకుండా ప్రభుత్వం సచివాలయ సిబ్బందితో కేంద్రాలు తెరిపించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చేస్తోంది. దీంతో లబ్ధిదారులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

క్రిస్మస్ ఆరాధన


కోదూరులో క్రీస్తును ఆరాధిస్తున్న మతవిశ్వాసకులు

బాడంగి: మండలంలోని కోదూరులో ఉన్న కోదూరుమాత ప్రార్థనాలయంలో చర్చి ఫాదర్ యుగల్‌కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ ఆరాధన శుక్రవారం నిర్వహించారు. మతవిశ్వాసకులంతా వేకువజామున పుణ్యస్నానాలు ఆచరించి, కొవ్వొత్తుల వెలుగులతో వీధుల్లో తిరిగి, పాటల రూపంలో క్రీస్తు గొప్పతనం, ఆయన రాకడపై ప్రచారం చేశారు. అనంతరం చర్చికి చేరుకుని, దివ్యబలిపూజలో పాల్గొని, ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

క్వారీ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ

వంగర: మండలంలోని జగన్నాథవలసలో కొత్తగా గ్రానైట్ క్వారీ ఏర్పాటుకు సంబంధించి, శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మద్దువలస, నీలయ్యవలస, జగన్నాథవలస గ్రామస్తులతో పాటు స్వచ్ఛంద సంస్థల సభ్యుల అభిప్రాయం వ్యక్తం చేశారు. అలాగే క్వారీలో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించి, పరిసర గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. జిల్లా డీఆర్‌వో ఎస్.డి.అనిత మాట్లాడుతూ క్వారీల నిర్వహణలో నిబంధనలు పాటించాలని క్వారీ యజమానులకు సూచించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ విభాగం ఈఈ బి.బి.సరిత, తహసీల్దార్ ఐజాక్ తదితరులు పాల్గొన్నారు.

శతశాతం లక్ష్య సాధనకు కృషి

రాజాం సిటీ: మున్సిపాలిటీలో శతశాతం ఆస్తిపన్ను వసూలుకు కృషి చేయాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన ఇప్పటివరకు సచివాలయాల పరిధిలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి నెలాఖరు నాటికి ఆస్తిపన్ను, నీటి పన్నుతో పాటు వీఎల్‌టీల పన్నులు వసూలు చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పట్టణంలోని అభివృద్ధి పనులపై దృష్టి సారించాలన్నారు. అనంతరం గాత్రాజుచీపురుపల్లి వద్ద ఏర్పాటు చేసిన మున్సిపాలిటీకి చెందిన కంపోస్టుయార్డును పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ నాగరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బేడా సేవ

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని సింగారపు వీధిలో ఉన్న వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బేడా సేవ శుక్రవారం నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో హారతి, విశేష కైంకర్యాలు చేపట్టారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

వంగర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శుక్రవారం మండలంలోని అరసాడ గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్ తపన అని, ప్రతీ ప్రాంతం అభివృద్ధి చెందేలా, ప్రతీ వర్గంలోని ప్రజలకు మేలు జరిగేలా ఆయన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. గ్రామ సచివాలయాలతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పథకాలు చేరుస్తున్న ఘనత ఆయనదేనన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ జన్మభూమి కమిటీలు వ్యవహరించిన తీరు, వారు దోచుకున్న ప్రజాధనం గురించి అందరికీ తెలిసిన విషయమేనన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలను చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించి, వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కె.సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

రేగిడి: మండలంలో ఈ నెల 26వ తేదీ నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.శ్యామలాకుమారి తెలిపారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పాఠశాలల పీడీలు, పీఈటీలతో శుక్రవారం సమావేశమైన ఆమె మండలంలో 25 గ్రామసచివాలయాల పరిధిలో 11 క్రీడామైదానాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, కార్యక్రమం విజయవంతమయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బి.ఎరకయ్య తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సచివాలయాల సిబ్బంది, వలంటీర్లతో ఎంపీడీవో రమామణి శుక్రవారం సమావేశమై, ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు చేశారు.

రాజాం సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించి, పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు, వలంటీర్లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో శంకరరావు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి జరిగే క్రీడాపోటీలు విజయవంతంగా ముగిసేలా చూడాలని కోరారు.





